

అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన వసంత సోమవారం రూ.1.20 లక్షలు విరాళంగా అందజేశారు.



మల్లన్నకు వెండి రథోత్సవం

శ్రీశైలంటెంపుల్: ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో సోమవారం స్వామిఅమ్మ వార్లకు సహస్రదీపార్చన సేవ చేపట్టారు. అనంతరం వెండి రథోత్సవాన్ని నిర్వహించారు.



హలీమ్.. తినరా మైమ'రుచి'

రంజాన్ మాసంలో లభించే హలీమ్‌కు ఎంతో ప్రత్యేకత ఉంది. పౌష్టికాహార వంటకాన్ని ముస్లింలే గాక మాంసాహార ప్రియులు కూడా తప్పక రుచి చూస్తున్నారు.

8లో



	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:53
ఆదోని	సా॥ 6:38	ఉ॥ 4:56
నంద్యాల	సా॥ 6:35	ఉ॥ 4:56
ఆత్మకూరు	సా॥ 6:33	ఉ॥ 4:51
బనగానపల్లె	సా॥ 6:36	ఉ॥ 4:51

రంజాన్ వేళలు

హదీస్ వెలుగు :

తప్పులు చేయడం అంటే కేవలం చేతులతోనే కాదు. మాటలు, చెవులు, చూపులతోనూ తప్పులు జరుగుతాయి. వాటన్నింటి నుంచి నియంత్రణలో ఉండాలి.

– పవిత్ర ఖురాన్

జాగ్రత్తలతో సాగు





బయోకెమెస్ట్రీలో ఎంఎస్సీ పూర్తయింది. బెంగళూరులో మైలాన్ ఫార్మా కంపెనీలో ఉన్నత ఉద్యోగం చేస్తున్నా. వ్యవసాయంపై మక్కువ ఉండటం, బయట ఉద్యోగాల పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో 2022లో కోడుమూరులోని 2 ఎకరాల భూమిలో 1000 మొక్కలతో టిష్యూకల్చర్ అరటి సాగు మొదలుపెట్టా. ఇందులోనే అంతర పంటగా వెయ్యి మొక్కలతో వక్క సాగు చేస్తున్నా. వీటికి అదనంగా 70 టెంకాయ మొక్కలను పెంచుతున్నా. బెంగళూరు నుంచే పంటలను పర్యవేక్షిస్తూ తగిన జాగ్రత్తలతో సాగులో మెలకువలు పాటిస్తున్నా. ఎప్పటికైనా వ్యవసాయమే ఉత్తమం. – వెంకటేష్, కోడుమూరు

మట్టిపై మమకారం



ఇంజనీరింగ్ పూర్తి చేసి హైదరాబాద్‌లో పది సంవత్సరాలు బ్యాంక్ ఆఫ్ అమెరికా సాఫ్ట్‌వేర్ కంపెనీలో అనలిస్టుగా ఉన్నా. జీతం నెలకు రూ.లక్ష వరకు వస్తుంది. కరోనా కారణంగా రెండు సంవత్సరాల క్రితం వర్క్ ఫ్రం హోంతో సొంతూరు చేరుకున్నా. వారాంతాల్లో టైంపాస్‌గా మా నాన్నతో కలిసి పొలం పనుల్లో పాల్పంచుకున్నా. మట్టిపై మమకారం పెరిగింది. ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని నిశ్చయించుకున్నా. అలా డ్రాగన్ ఫ్రూట్ సాగుతో పాటు తైవాన్ జామ, జామ తోటలు సాగు చేస్తుండటంతో ఆదాయం బాగానే ఉంటోంది.

– రవికాంత్, శాంతినగరం గ్రామం, ఆళ్లగడ్డ మండలం

వ్యవసాయంతో మనశ్శాంతి



ఎంసీఏ పూర్తి చేసి బెంగళూరులోని కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా నాలుగు సంవత్సరాలు పని చేశా. పదోన్నతిపై అసెంచర్ సంస్థలో సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా మూడు ఏళ్లు ఉన్నా. లక్షలాది రూపాయల జీతం వస్తున్నా ఆత్మ సంతృప్తి దక్కలేదు. మూడేళ్ల క్రితం స్వగ్రామం చేరుకొని స్థానిక పరిస్థితులను అవగతం చేసుకున్నా. కేసీ కింద వరి సాగు చేస్తున్నా. ఆ తర్వాత వ్యవసాయంపై దృష్టి సారించడంతో మనశ్శాంతిగా జీవిస్తున్నా. – ఉమామహేశ్వరుడు, చాబోలు గ్రామం, నంద్యాల మండలం

ప్రముఖ సంస్థల్లో ఇటీవల ఉద్యోగుల తొలగింపు ఇలా..


బైజూస్	2,500
స్టార్టప్ కంపెనీలు	17,604
గూగుల్	12,000
మెటా	11,000
ఐబీఎం	3,900
ఎస్ఏపీ	3,000
అసెంచర్	7,000



సేద్యానికి వారసులు!

వ్యవసాయంలో యువత రాణింపు

- ఐటీ ఉద్యోగాలు కాదని పల్లెల్లో మకాం
- కరోనా తర్వాత మారిన జీవన చిత్రం
- వరుస ఉద్యోగాల కోతతో ఆలోచనలో మార్పు
- పంటల సాగు దిశగా అడుగులు



దేశానికి వెన్నెముక రైతన్న. వ్యవసాయం లేనిదే మానవ మనుగడ లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతి ఒక్కరికీ నోట్లోకి ఐదు వేళ్లు పోతున్నాయంటే అది అన్నదాత కష్టం. ఆరుగాలం శ్రమించి చెమట చిందిస్తే కానీ పొలం పండదు, జనానికి పూట గడవదు. ఉదయం కోడి కూయగానే భుజాన కాడి వేసుకొని బయలుదేరడం.. సాయంత్రం పొద్దు వాలగానే ఇంటికి చేరుకోవడం.. ఇదే రైతుల జీవనం. కష్టనష్టాలు బేరీజు వేసుకోకుండా మట్టినే నమ్ముకుని ఆశల జూదంలో తన అదృష్టాన్ని పరీక్షించుకోవడం ఆయనకే చెల్లు. – సాక్షి, కర్నూలు డెస్క్


వ్యవసాయం తప్ప మరో లోకం తెలియని రైతన్న జీవితాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కసారిగా మార్చేసింది. పట్టణాలు విస్తరించడం.. చుట్టుపక్క గ్రామాలు అందులో కలిసిపోవడంతో గ్రామీణ వాతావరణం కాంక్రీట్ వనాలను తలపిస్తోంది. వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తుండటం.. భూమి విలువ పెరగడంతో వ్యవసాయం క్రమంగా తగ్గుతూ వస్తోంది. అభివృద్ధి వేగవంతం కావడంతో వ్యవసాయ భూమి అందులో భాగమవుతోంది. ఒకప్పుడు వ్యవసాయం అంటే ఇంటిల్లిపాదీ కష్టపడుతూ పంటను చూసి మురిసిపోయే పరిస్థితి. తమతో పాటు పిల్లలను కూడా మట్టిలో దింపి వారసత్వంగా పొలాలను కట్టబెట్టేవారు. వరుస కరువులు.. గిట్టుబాటు కాని ధరలు.. నకిలీ విత్తనాలు.. ఇలా ఎన్నో కారణాలతో వ్యవసాయం భారమవుతూ వచ్చింది. ఈ పరిస్థితుల్లో ఎంత కష్టమైనా తమ పిల్లలను చదివించుకోవాలని, అక్షర సేద్యం చేయించాలనే నిర్ణయానికి వచ్చారు. పొలానికి దూరం చేసి, పాఠశాలకు దగ్గర చేయడంతో వ్యవసాయం కుటుంబ పెద్ద వరకే పరిమితమైంది.

'ఐటీ' నగరాల్లో మకాం

పిల్లల చదువుకు ప్రాధాన్యత ఇవ్వడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి ఎంతో మంది యువకులు పట్టణాల్లో కొలువుల్లో చేరిపోయారు. సొంతూళ్లకు పండగలు, పబ్బాలకు తప్పితే నగరాల్లోనే మకాం పెట్టేశారు. వేలాది రూపాయల జీతాలు.. శని, ఆదివారాల వీకెండ్.. వీలాసవంతమైన జీవనం.. వెరసి పుట్టిన ఊరిపై మమకారం క్రమంగా దూరమవుతూ వచ్చింది. అక్కడి వాతావరణానికి అలవాటు పడటంతో వ్యవసాయంపై పిల్లలకు పట్టు తప్పింది. తండ్రి వరకే వ్యవసాయం పరిమితం కావడంతో, ఆ తర్వాత భూములు చూసుకునే పరిస్థితి లేక విక్రయానికి పెట్టడం జరుగుతోంది.

ఉమ్మడి జిల్లాలో వినూత్న పంటల సాగు ఇలా.. (హెక్టార్లలో)

ఖర్జూర	10	డ్రాగన్ ఫ్రూట్	45
ద్రాక్ష	8	అశ్వగంధ	415
నన్నారి	16	జామూన్	81
అంజూర	7	ఖర్బూజ	93
ఆపిల్ బేర్	13	ఎర్రచందనం	23
సీతాఫలం	230	వాము	2,067



వ్యవసాయమే మేలనుకొని..

కరోనా కారణంగా వర్క్ ఫ్రం హోంతో సొంతూళ్లకు చేరుకున్న ఉద్యోగులు అందివచ్చిన సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం మొదలుపెట్టారు. ఉద్యోగం చేస్తూనే సొంత పొలాల్లో వినూత్న వ్యవసాయం చేసే దిశగా ఆలోచనకు పదును పెట్టారు. వ్యవసాయంలో పెరిగిన ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు, సంప్రదాయ పంటల సాగుతో నష్టాలను గుర్తించారు. హార్టికల్చర్‌తో పాటు వినూత్న పంటల సాగు దిశగా అడుగులు వేస్తూ విజయం సాధిస్తున్నారు. ఐటీ ఉద్యోగంలో వచ్చే జీతాలకన్నా, వ్యవసాయంలో అంతకు మించి డబ్బు సంపాదించే అవకాశాలు ఉండటంతో ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు చేరుకుంటున్న ఐటీ ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

కరోనాతో ఉద్యోగాల్లో కోత

ప్రపంచాన్ని వణికించిన కరోనా ప్రభావం ఐటీ ఉద్యోగులపైనా తీవ్ర ప్రభావం చూపింది. అప్పటి వరకు ఇబ్బడిముబ్బడిగా ఉద్యోగాల భర్తీ చేపట్టిన ఐటీ కంపెనీలు వర్క్ ఫ్రం హోం పేరిట ఉద్యోగులను ఇంటికే పరిమితం చేశాయి. ఆ తర్వాత ఖర్చుల సాకుతో ఇదే పంథా కొనసాగించినా, ఉద్యోగాల్లో కోత పెట్టడం అధికమైంది. ఒకటి కాదు, రెండు కాదు.. ఎంతో పేరు ప్రఖ్యాతలున్న కంపెనీలు కూడా వేలల్లో ఉద్యోగులను తొలగించడంతో జీవితాలు తారుమారయ్యాయి.

బలపడుతున్న కుటుంబం

పిల్లలు పట్టణాలకే పరిమితం కావడంతో పల్లెల్లో ఇళ్ల వద్ద వయస్సు పైబడిన వాళ్లు మాత్రమే బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సిన పరిస్థితి. పిల్లలు ఎప్పుడు వస్తారోనని ఎదురుచూడటంతోనే సరిపోయేది. అయితే కరోనా పుణ్యమా అని ఐటీ ఉద్యోగాల్లో కోత పడటంతో చాలా మంది పట్టణాలను వదిలి సొంతూళ్లకు చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ వ్యవస్థ బలపడుతోంది. పిల్లలకు పెద్దలతో అనుబంధం ఏర్పడుతోంది.

న్యూస్‌రీల్

స్పందనలో 120 ఫిర్యాదులు



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 120 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్పందనలో అర్జీదారుల సమస్యలకు నేరుగా పరిష్కారం చూపామని మరికొన్ని ఫిర్యాదులను ఆయా స్టేషన్ అధికారులకు రెఫర్ చేశామన్నారు. వినతుల్లో అధికంగా ఆస్తి తగాదా లు, కుటుంబ కలహాలు, అత్తింటి వేధింపులు తదితర సమస్యలు ఉన్నాయన్నారు. స్పందన వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమణ, ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ రామాంజినాయక్ పాల్గొన్నారు.

మద్దిలేటయ్య హుండీ ఆదాయం రూ.32.74 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల హుండీ లెక్కింపు నిర్వహించారు. 42 రోజులకు సంబంధించిన హుండీ లెక్కించగా రూ.39,80,602 లక్షలు, 95 గ్రాముల బంగారు, 2.400 కేజీల వెండి వచ్చింది. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షణలో ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ సీతారామ చంద్రుడు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యు లు లక్ష్మినాయుడు, సుశీల, రామసుబ్బమ్మ, తిమ్మారెడ్డి, లక్ష్మీదేవి, మద్దిలేటి స్వామి, కృష్ణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, వేదపండితులు కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

డీఎడ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లింపునకు 24 ఆఖరు

కర్నూలు సిటీ: జిల్లాలో 2015-17, 2018-20 డీఎడ్ బ్యాచ్‌లకు చెందిన స్పాట్, మేనేజ్‌మెంట్ అభ్యర్థులు సెకండియర్ సప్లిమెంటరీ పరీక్షలకు వచ్చే నెల 24వ తేదీలోపు ఫీజులు చెల్లించాలని డీఈఓ వెంకట రంగారెడ్డి సోమవారం తెలిపారు. రూ.50 జరిమానాతో వచ్చే నెల 28వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. నాలుగు నుంచి ఆరు సబ్జెక్టులకు రూ.250, మూడు సబ్జెక్టులకు రూ.175, రెండు సబ్జెక్టులకు రూ.150, ఒక సబ్జెక్టుకు రూ.125 చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు.

రేపు జెడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు(అర్బన్): జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, భూగర్భ జలవనరుల శాఖ, గృహ నిర్మాణం, పశుసంవర్ధక శాఖలపై ఈ సమావేశంలో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరుకానున్నారని తెలిపారు.

4న అరుణాచలానికి 'ఇంద్ర'

కర్నూలు(రాజ్‌విహార్): గిరి ప్రదక్షిణ దీపోత్సవం సందర్భంగా తమిళనాడులోని అరుణాచల క్షేత్రం దర్శనానికి ఏప్రిల్ 4న ఇంద్ర ఏసీ ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు కర్నూలు-2 డిపో మేనేజర్ సర్దార్ హుసేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం రాత్రి 8గంటలకు కర్నూలు నుంచి ఈ బస్సు బయలుదేరి, బుధవారం తెల్లవారు జామున 5 గంటలకు అరుణాచలానికి చేరుకుంటుందన్నారు.

సహకార సొసైటీల బలోపేతానికి సీఎం కృషి

- ప్రతి కొత్త జిల్లాలో డీసీసీబీ రీజినల్ బ్రాంచ్‌ల ఏర్పాటు
- డీసీసీబీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు, కల్యాణ మండపాలు, గోడౌన్ల నిర్వహణ
- ఆప్కాబ్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఝాన్సీరాణి



డీసీసీబీ రీజనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి, ఏపీ మార్కెఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, డీసీసీబీ చైర్‌పర్సన్ మహాలక్ష్మి తదితరులు

నంద్యాల: సహకార సొసైటీల బలోపేతానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఆప్కాబ్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఝాన్సీరాణి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రమైన నంద్యాలలో డీసీసీబీ రీజినల్ కార్యాలయాన్ని ఝాన్సీరాణి, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డి, ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనాథరెడ్డి, డీసీసీబీ చైర్‌పర్సన్ మహాలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణి మాట్లాడుతూ సొసైటీల పర్యవేక్షణకు వీలుగా ప్రతి కొత్త జిల్లాలో డీసీసీబీ రీజినల్ కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సొసైటీలను రైతులు, ప్రజలకు మరింత దగ్గర చేస్తామన్నారు. డీసీసీబీల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు, కల్యాణ మండపాలు, గోడౌన్లు తదితరాలు నిర్మించి, వాటి ద్వారా ఆదాయం పెంచి సొసైటీలను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. ప్రాథమిక సహకార సంఘాల్లో మరిన్ని సేవలు ఆన్‌లైన్ ద్వారా అందించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. త్వరలోనే ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం తదితర సేవలను పొందవచ్చన్నారు. వీటి ద్వారానే రుణాలు మంజూరు, చెల్లింపులు చేసేలా వీలవుతుందన్నారు. రైతులు, వ్యాపారులకు సహకార సంఘాల నుంచి రుణ సదుపాయం కల్పిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. త్వరలోనే ప్రాథమిక సహకార సంఘాల సేవలను ప్రజల్లో తీసుకెళ్లేందుకు వారోత్సవాలు, అవగాహన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ ఆప్కాబ్ ఆధ్వర్యంలో రైతులకు పంట రుణాలు సహకార సొసైటీల ద్వారా అందిస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీసీసీబీ చైర్‌పర్సన్ మహాలక్ష్మి మాట్లాడుతూ రూ.3,500 కోట్ల టర్నోవర్‌తో రాష్ట్రంలో ఐదో అతిపెద్ద బ్యాంకుగా కర్నూలు డీసీసీబీ నిలిచిందన్నారు. నంద్యాలో రీజినల్, బనగానపల్లెలో కార్యాలయాల నిర్మాణాలను త్వరలోనే చేపడతామన్నారు. సహకార సొసైటీల ద్వారా 10,630 మంది రైతులకు రూ.460.64 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ రామాంజనేయులు, జనరల్ మేనేజర్ శివలీల, జిల్లా సహకార అధికారి విజయకుమారి, ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటకృష్ణ, ఆప్కాబ్ డీజీఎం విజయ్‌కుమార్, నంద్యాల కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ హుసేన్‌బాషా, రాజా విష్ణువర్ధన్‌రెడ్డి, సహకార కేంద్ర బ్యాంకు పాలక వర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భద్రత భారం మల్లన్నదే!

- మూడు నెలలుగా సీఎస్‌వో పోస్టు ఖాళీ
- ఔట్ సోర్సింగ్ పోస్టు.. నామమాత్రపు అధికారాలు
- ఆసక్తి చూపని రిటైర్డ్ పోలీసు అధికారులు



శ్రీశైల దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది

శ్రీశైలంటెంపుల్: ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తి పీఠం కలసివెలసిన పుణ్యక్షేత్రం శ్రీశైలం. శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి రోజూ ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం వేలాది మంది భక్తులు నిత్యం తరలివస్తారు. శ్రీశైల దేవస్థానం రక్షణ, భక్తుల భద్రత అత్యంత కీలకం కాగా.. మూడు నెలలుగా ఆలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్ఓ) పోస్టు ఖాళీగా ఉండటం పలు విమర్శలకు దారితీస్తోంది. సుమారు 150 మంది సెక్యూరిటీ గార్డులు, 50 మంది హోంగార్డులు ఆలయం భద్రతకు విధులు నిర్వహిస్తున్నారు. భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడం, భద్రతా పరంగా ఆలయంలోకి సెల్‌పోన్లు, పేలుడు పదార్థాలు, నిషేధిత వస్తువులను తీసుకెళ్లకుండా తనిఖీలు నిర్వహించడం, టికెట్ కౌంటర్ల వద్ద రద్దీ క్రమబద్ధీకరణ, దేవస్థాన భూములు, ఆస్తుల పరిరక్షణ, అసాంఘిక శక్తులు ఆలయంలోకి చొరబడకుండా అరికట్టడం, క్షేత్ర రక్షణ, పలు రకాల విధులను సీఎస్ఓ పర్యవేక్షిస్తారు. గతంలో పనిచేసిన సీఎస్‌వో రెండేళ్ల కాల పరిమితి కాగా గత సంవత్సరం డిసెంబర్ 27వ తేదీతో పూర్తయింది. అప్పటి నుంచి సుమారు మూడు నెలలుగా సీఎస్‌వో పోస్టు ఖాళీగా ఉంది. ఈ పోస్టు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమించుకోవాలని దేవదాయశాఖ ఆదేశించింది. సీఎస్‌వోగా విధులు నిర్వహించే వ్యక్తి శారీరకంగా, ఆరోగ్యకరంగా దృఢంగా ఉండాలి. ఇప్పటి వరకు దేవస్థాన సీఎస్‌వోలుగా రిటైర్డ్ సీఐలు, ఆర్మీ అధికారులు విధులు నిర్వహించారు. ప్రస్తుతం పర్యవేక్షకులు స్థాయి అధికారికి ఇన్‌చార్జ్ సీఎస్‌వోగా తాత్కాలిక విధులు కేటాయించారు.

అర్హతలు నోటిఫికేషన్‌కే పరిమితం..

శ్రీశైల దేవస్థానంలో సీఎస్‌వో పోస్టుకు డీఎస్పీ స్థాయి అధికారిని తీసుకోవాలని దేవదాయశాఖ ఉత్తర్వుల్లో ఉన్నప్పటికీ ఔట్‌సోర్సింగ్ పోస్టు కావడంతో ఇప్పటి వరకు డీఎస్పీ స్థాయి అధికారి ఎవరూ విధులు నిర్వహించ లేదు. గతంలో సీఎస్‌వోగా రిటైర్డ్ సీఐ స్థాయి వారు ముగ్గురు, రిటైర్డ్ ఆర్మీ అధికారి ఒకరు విధులు నిర్వహించారు. మిగిలిన వారు దేవస్థాన పర్యవేక్షకులు, ఏఈవో స్థాయి అధికారులు విధులు నిర్వహించారు. ఔట్ సోర్సింగ్ పోస్టు కావడం, నామమాత్రపు అధికారాలు ఉండటంతో భద్రత పరంగా ఏదేని చర్యలు తీసుకోవాలన్నా ఈఓ అనుమతి తీసుకోవాల్సిందే. ప్రస్తుతం ఖాళీగా ఉన్న సీఎస్ఓ పోస్టు భర్తీ చేసేందుకు ఈ ఏడాది ఫిబ్రవరి 1న దేవస్థానం నోటిఫికేషన్ జారీ చేసింది. కనీసం ఐదేళ్లు డీఎస్పీ హోదాలో విధులు నిర్వహించి, పదవీ విరమణ చేసి, 65 ఏళ్ల వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో సూచించారు. అయితే ఈ పోస్టుకు కేవలం 8 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో మొదటి సారిగా ముగ్గురు రిటైర్డ్ డీఎస్పీలు, ఒకరు రిటైర్డ్ ఏఎస్పీ, ఒకరు జైలర్ ఉన్నట్లు తెలుస్తోంది. శ్రీశైల ఆలయ భద్రతా దృష్ట్యా సీఎస్ఓ పోస్టులో ఇతర ప్రభుత్వ శాఖల నుంచి డిప్యూటేషన్‌పై తీసుకుంటే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు.

ఎస్పీ పర్యవేక్షణలోనే నియామకం

శ్రీశైల దేవస్థానం భద్రత ఎంతో కీలకం. ఇందుకోసం రిటైర్డ్ డీఎస్పీ స్థాయి అధికారిని భద్రతాధికారిగా నియమించేందుకు నోటిఫికేషన్ జారీ చేశాం. ఇప్పటి వరకు ఎనిమిది దరఖాస్తులు వచ్చాయి. జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో నియామకం చేపట్టాలని లేఖ రాశాం. ఎస్పీ పర్యవేక్షణలో సీఎస్‌వో నియామకం జరుగుతుంది. ఎస్పీ సూచనలు, సలహాల ప్రకారం క్షేత్రంలో సీఎస్‌వో పర్యవేక్షణలో భద్రత చర్యలు చేపడతాం.

– ఎస్.లవన్న, శ్రీశైలాలయ కార్యనిర్వహణాధికారి

స్పందన వినతులకు ప్రాధాన్యత ఇవ్వండి

- ఓటరు జాబితాను ఆధార్‌తో అనుసంధానం చేయాలి
- చెంచుగూడేల్లో సదుపాయాల కల్పనకు నివేదిక ఇవ్వండి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ

నంద్యాల: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు, జాయింట్ కలెక్టర్ నిశాంతి, డీఆర్ఓ పుల్లయ్య, ఉన్నతాధికారులు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏఏ సచివాలయాల నుంచి అధికంగా అర్జీలు వస్తున్నాయో గుర్తించి తహసీల్దార్లు స్వయంగా వెళ్లి విచారణ చేసి వచ్చే స్పందన కార్యక్రమంలో నివేదిక ఇవ్వాలని తహసీల్దార్లకు సూచించారు. ఓటరు జాబితా ఆధార్ అనుసంధానానికి సంబంధించి ఇంకా జిల్లా వ్యాప్తంగా 2,51,245 మంది ఓటరు ఫాం-6బీ పెండింగ్‌లో ఉందని, బీఎల్ఓల వారీగా రోజువారి లక్ష్యాలు కేటాయించి ఈనెల 30 తేదీలోగా పూర్తి చేయాలన్నారు. నాడు-నేడు కింద పనులు చేపట్టిన పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. పాఠశాలల్లో తాగునీరు, టాయిలెట్, రన్నింగ్ వాటర్, మెనూ అమలు తదితర అంశాలను పరిశీలించి వచ్చే నెల 6వ తేదీలోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మున్సిపల్ పట్టణాల్లో ఆర్‌డీఓలు, మున్సిపల్ కమిషనర్లు తనిఖీలు చేయాలన్నారు. ఈనెల 29న కర్నూలు జిల్లా పరిషత్ సమావేశంలో తాగునీరు, భూగర్భ జలాలు, హౌసింగ్, పశుసంవర్ధకం తదితర అజెండా అంశాలపై సమావేశం ఉంటుందని, ఈ మేరకు అధికారులు సిద్ధమవ్వాలన్నారు. జిల్లాలోని చెంచు గూడెంలను దత్తత తీసుకున్న అధికారులు సందర్శించి చెంచులకు కల్పించాల్సిన సదుపాయాలపై ప్రణాళిక రూపొందించాలన్నారు. స్పందనలో 175 మంది వినతులు అందజేయగా, వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

పల్లె ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



104 వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంతో పల్లె ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్ఆర్ సెంటినరీ హాల్ ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు అదనంగా కేటాయించిన ఐదు నూతన 104 వాహనాలను కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ నిశాంతి, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్ రెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి వెంకటరమణ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 104 వాహనాలు జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున 29 అందుబాటులో ఉన్నాయన్నారు. వీటికి అదనంగా మరో ఐదు వాహనాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, నంద్యాలకు కేటాయించగా, ఒకటి రిజర్వులో (ఇతర వాహనాలు రిపేర్‌లో ఉన్నప్పుడు ఈ వాహనం వినియోగిస్తారు) ఉంటుందన్నారు. పెద్ద మండలాల్లో వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు ఏర్పడటంతో ప్రభుత్వం అదనంగా ఐదు వాహనాలను మంజూరు చేసిందన్నారు. ప్రతి వాహనం ఒక సచివాలయాన్ని రెండు సార్లు సందర్శిస్తుందని, ఇందులో డాక్టర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా, ఎంపీహెచ్ఏ, డీఈఓ అందుబాటులో ఉంటారన్నారు. ఒక మెడికల్ ఆఫీసర్ 104లో విధులను నిర్వహిస్తే మరో మెడికల్ ఆఫీసర్ పీహెచ్‌సీలో సేవలు అందిస్తారన్నారు. ఉదయం వేళల్లో వచ్చిన ఏఎన్‌సీ, పీఎన్‌సీ, బీపీ, షుగర్, జనరల్ ఓపీ చూడటం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం నుంచి సచివాలయం వద్దకు రాలేని వికలాంగులు, వృద్ధులు, మంచానికి పరిమితమైన వారిని పరీక్షించి మందులు ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రభావతి, 104 జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి, మేనేజర్ మొహమ్మద్ రఫీ, ఎంఎల్‌హెచ్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హోంగార్డు కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ

బొమ్మలసత్రం: విధి నిర్వహణలో అనారోగ్యంతో ముగ్గురు హోంగార్డులు మృతి చెందగా జిల్లా ఎస్పీ వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో డోన్ పరిధిలో పని చేస్తూ మృతి చెందిన హోంగార్డులు మనోహరరెడ్డి, రమేష్ కుటుంబీకులకు ఫ్లాగ్ ఫండ్ కింద ఒక్కొక్కరికి రూ. 10 వేల చెక్కును అందజేశారు. అలాగే హోమ్‌గార్డు ప్రదీప్ కుటుంబ సభ్యులకు రూ. 15 వేల చెక్కును అందించామని వివరించారు. ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ రమణ, ఏఆర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తదితరులు ఉన్నారు.

కురువలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జబ్బల శ్రీనివాసులు

కర్నూలు(అర్బన్): అన్ని పార్టీలు కురువలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు కోరారు. బీసీ విద్యార్థి సంఘం జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షతన సోమవారం బీసీ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ కురువలను ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌పై ఏప్రిల్ 3, 4 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చామన్నారు. మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గోవా తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. కర్నూలు పార్లమెంటు స్థానంతో పాటు రెండు అసెంబ్లీ స్థానాలు కురువలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే కర్నూలులో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, ఇందుకు సంబంధించిన కార్యాచరణను త్వరలోనే ప్రకటించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో కురువ సంఘాల నాయకులు పంచలింగాల నాగరాజు, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఇన్‌చార్జి జోషి, కార్పొరేటర్ పరమేష్, కురువ సంఘం నగర అధ్యక్షులు తౌడు శ్రీనివాసులు, మహేంద్ర, నారాయణ, పెద్దనాగన్న, మదాసి, మదారి కురువ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుంకన్న, ఆర్‌వీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ తదితరులు హాజరయ్యారు.

‘అస్సాలామ్ అలైకుమ్ భాయ్.. ఇఫ్తార్‌కా వక్త్ హోరహా హై. మస్‌జిద్ చలో’. అచ్ఛ దోస్త్ ఇఫ్తార్‌కే బాద్ అచ్ఛీ హోటల్‌పే జాకె హలీమ్ ఖయేంగే.. అచ్ఛ భాయ్. జరూర్ సే బహుత్ మజేదార్ హలీమ్ ఖాయేంగే’. ఇదీ రంజాన్ మాసంలో సాయంత్రం కలిసిన మిత్రుల సంభాషణ.



హలీమ్ .. తినరా మైమరుచి

రంజాన్ ప్రత్యేకం

- చక్కటి పౌష్టికాహార వంటకంగా పేరు
- ఒక్కనెలలోనే రూ.2 కోట్ల వ్యాపారం
- నగరంలోనే 30కు పైగా విక్రయ కేంద్రాలు



హలీంను ఆరగిస్తున్న యువకులు

కర్నూలు(రాజ్‌విహార్): కేవలం రంజాన్ మాసంలోనే లభించే హలీమ్‌కు ఎంతో ప్రత్యేకత ఉంది. మటన్, నెయ్యితో చేసిన ఈ వంటకంలో వేయించిన ఉల్లి, కొత్తమీర, కాస్త పుదినా, జీడిపప్పు, నిమ్మకాయ వేసుకొని వేడివేడిగా తింటూ కాస్త పచ్చి ఉల్లి నంచుకుంటే ఆ రుచే వేరు. బలం, రుచికరమైన ఈ వంటను చూస్తే చాలు నోటిలో లాలాజలం ఊరుతుంది. ఒక్కసారి రుచి చూసిన ప్రతి ఒక్కరూ మరోసారి తినాలనుకుంటారు. ఉపవాస దీక్షలు లేనివారు సైతం లొట్టలేసుకొని ఆరగిస్తారు. కేవలం ముస్లింలే కాదు.. మాంసాహార ప్రియులు కూడా ఆ వంట వాసనకు ఆకర్షితులై ఒక్కసారైనా రుచి చూడాలని అనుకుంటారు. ఇదీ హలీమ్ ప్రత్యేకత.

నగర వీధుల్లో హలీమ్ ఘుమఘుమలు..

రంజాన్ మాసం వచ్చిందంటే చాలు.. కర్నూలు నగర ప్రధాన వీధుల్లో హలీమ్ వాసన ఘుమఘుమలాడుతుంది. ఆ వాసనకే దీని రుచి చూడాలని కొందరు.. కొత్తగా ట్రై చేసే వారు మరికొందరు.. ప్రతి ఏటా దీని రుచిని ఆస్వాదించే వారు ఇంకొందరు. రంజాన్ మెనూలో హలీమ్ తొలి స్థానాన్ని కైవసం చేసుకుంది. దమ్ బిర్యానీకి ఎంత పేరుందో రంజాన్ సీజన్‌లో దానికి మించి హలీమ్‌కు ప్రత్యేకత ఉంది. పొట్టేలు మాసం, నెయ్యి, గోధుమ రవ్వ, పిండిని వాడి దీనిని తయారు చేయడంతో ఇది మంచి పోషకాహారంగా చెప్పవచ్చు. ఈ కారణంగా అంతా దీనికి అభిమానులే. కర్నూలుతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం నగరంలో చికెన్ హరీస్ క్వాలిటీని బట్టి రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. అదే మటన్ హలీమ్ అయితే రూ.150 నుంచి రూ.200 వరకు అందుబాటులో ఉంది. నగరంలో వివిధ చోట్ల 30కు పైగా వికయ కేంద్రాలు ఉన్నాయి. రంజాన్ మాసంలో నగరంలో సుమారు రూ.2కోట్ల వరకు వ్యాపారం జరుగుందని వ్యాపారస్తుల అంచనా.



కర్నూలు నగరంలోని ఓ హలీమ్ విక్రయ కేంద్రం

రంజాన్ స్పెషల్‌కు భలే ఆదరణ



రంజాన్ నెల ప్రత్యేక వంటకం హలీమ్‌కు భలే ఆదరణ ఉంటుంది. కర్నూలులో 1989 నుంచి ఏటా హలీమ్ తయారు చేసి అమ్ముతున్నాం. దీని తయారీకి మేం ప్రత్యేకంగా స్వచ్ఛమైన నెయ్యి, నాణ్యత గల గోధుమలను ఉపయోగిస్తాం.
– షేక్ ఫయాజ్, తయారీదారుడు.

ఈ మాసంలో తప్పనిసరి



హలీమ్ ఇతర మాసాల్లో దొరకదు. మంచి శక్తినిచ్చే పౌష్టికాహారం. రోజంతా ఉపవాసం ఉన్నవాళ్లకి హలీమ్ త్వరగా శక్తినిస్తుంది. దీనిని ఈ మాసంలో తప్పనిసరిగా తింటాం. కుటుంబ సభ్యులూ ఇష్టంగా తింటారు. వారికీ తసుకెళ్తాను.
– మహమ్మద్ జావీద్, కర్నూలు

రుచిలో రారాజు



రంజాన్ మాసంలో లభించే ప్రత్యేక వంటకం హలీమ్. రుచిలో రారాజు. ఒక్కసారి రుచి చూస్తే మళ్లీ మళ్లీ తినాలనిపిస్తుంది. అందుకే దీనికి అంత ప్రత్యేకత. ఉపవాసం ఉన్నవాళ్లే కాదు.. లేనివారు సైతం ఆరగిస్తారు.
– షేక్షావలి, కర్నూలు

స్నేహితులతో కలిసి వస్తా



హలీమ్ రుచి చూసేందుకు రెండు రోజులకోసారి స్నేహితులతో కలిసి వస్తా. రంజాన్ మాసంలోనే లభించే ఈ వంటకం రుచి చూస్తే ఎవరూ వద్దనరు. ప్రతి రోజూ తినాలనిపిస్తుంది. బిర్యానీ, ఇతర వంటలు ఎప్పుడైనా తినవచ్చు. కానీ హలీమ్ రంజాన్‌లోనే దొరుకుతుంది.
– కమల్, విద్యార్థి

దొంగల అరెస్ట్.. చోరీ సొమ్ము రికవరీ



నిందితులను అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఐ మల్లికార్జున

తుగ్గలి: పశువులు, కరెంటు సామగ్రి దొంగలించుకుపోయిన దొంగలను తుగ్గలి పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. ఇటీవల తుగ్గలిలో వామిదొడ్డిలో కట్టేసిన నాలుగు ఎద్దులు, విద్యుత్తు సబ్‌స్టేషన్లో విద్యుత్తు వైరును వేర్వేరుగా రాత్రి సమయాల్లో దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఎట్టకేలకు విద్యుత్తు సబ్‌స్టేషన్ సమీపంలోని ఎద్దులదొడ్డి రస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని విచారించి చోరీ విషయం రాబాట్టారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం పోతురాయికి చెందిన సాకే బాలన్న, ముకుందాపురం ఎరుకలి మల్లికార్జున, పొరల్లకు చెందిన ఎరుకలి చిన్న గంగన్న, ముంటిమడుగు పలాజి సుధాకర్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.1,90,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున చెప్పారు. కేసు ఛేదించిన కానిస్టేబుళ్లు షబ్బీర్ బాషా, వినోద్‌లను ఎస్‌ఐ అభినందించారు.

అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారాలు

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ పి.కోటేశ్వరరావు



స్పందన కార్యక్రమంలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): స్పందన కార్యక్రమానికి వచ్చే సమస్యలకు అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారాలు చూపాలని అధికారులను కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశిత గడువులోగా సమస్యలకు పరిష్కారాలు చూపాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు శ్రద్ధ చూపాలన్నారు. స్పందన కార్యక్రమాన్ని సీఎంఓ నుంచి పర్యవేక్షణ చేస్తున్నారని, నిర్లక్ష్యాన్ని వీడాలని సూచించారు. స్పందన కార్యక్రమంలో జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్వో ఎస్వీ నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

‘స్పందన’కు వచ్చిన సమస్యల్లో కొన్ని...

- తనకు నాలుగు ఎకరాల పొలం ఉందని, అందులో ఎకరా పొలాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని, తగిన చర్యలు తీసుకోవాలని తుగ్గలికి చెందిన మేఘన ఫిర్యాదు చేసింది.
- తన పొలంలో ఉన్న బావిని గ్రామ నీటి అవసరాలకు తీసుకున్నారని, అధికారులు ఇచ్చే పరిహారం చాలడంలేదని, తన బావిని తన వదిలి వేయాలని కర్నూలు మండలం నూతనపల్లెకు చెందిన నడిపి రాముడు కోరారు.
- తనకు పక్షపాతం ఉందని, సదరం క్యాంప్‌లో తక్కువ పర్సెంటేజీతో ధ్రువీకరణ పత్రం ఇచ్చారని, మరోసారి సదరానికి అవకాశం ఇవ్వాలని కర్నూలు మండలం మామిదాలపాడుకు చెందిన అశోక్ కమార్ విన్నవించారు.
- పొలంలో పంటలు వేయకుండా బోయ తలారి మద్దయ్య అడ్డుపడుతున్నారని, తగని చర్యలు తీసుకోవాలని కృష్ణగిరి మండలం పుట్లూరుకు చెందిన బండారు మాదన్న ఫిర్యాదు చేశారు.
- కల్లూరు పరిధిలోని విఠల్ నగర్‌లో అగ్రసేని సంస్థ నిర్మిస్తున్న రియల్ ఎస్టేట్ సంస్థ వెంచర్‌పై అనేక అభ్యంతరాలు ఉన్నాయని, వాటిపై పరిశీలన చేయాలని రాయలసీమ యువజన పోరాట సమితి నాయకులు వీవీనాయుడు, ఎ.రామిరెడ్డి, పి.అశోక్ కలెక్టర్‌కు విన్నవించారు.

కృత్రిమ గర్భధారణతో మేలు జాతి దూడలు



రైతుకు టిఫిన్ క్యారియర్ అందజేస్తున్న జేడీ రామచంద్రయ్య

కర్నూలు(అగ్రికల్చర్): కృత్రిమ గర్భధారణతో నాటు గేదెలు, ఆవుల ద్వారా మేలు జాతి దూడలను అభివృద్ధి చేసుకోవచ్చని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య తెలిపారు. సోమవారం కర్నూలు మండలం పి.రుద్రవరం గ్రామంలో జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా నాటు గేదెలు, ఆవులకు పుట్టిన 42 మేలుజాతి దూడలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ లింగనిర్ధారిత వీర్యం ద్వారా పెయ్య దూడలు మాత్రమే అభివృద్ధి చేసుకునే అవకాశం కూడా అందుబాటులోకి వచ్చిందన్నారు. దూడలకు కాల్షియం టానిక్‌లు, దూడల యజమానులకు టిఫిన్ క్యారియర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్, కర్నూలు డివిజన్ డీడీ దుర్గాప్రసన్నబాబు, కోడుమూరు ఏరియా పశువైద్యశాల ఏడీ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు జిల్లా విద్యార్థి



వేరుశనగకాయల నుంచి విత్తనాలను వేరు చేసే యంత్రంతో విద్యార్థిని రాజా సుహాని

కర్నూలు సిటీ: జిల్లా విద్యార్థిని రాజా సుహాని తయారు చేసిన వేరుశనగ కాయల నుంచి విత్తనాలను వేరు చేసే యంత్రం జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు ఎంపికైంది. విద్యార్థినిని సోమవారం తన కార్యాలయంలో డీఈఓ డాక్టర్ వెంకట రంగారెడ్డి అభినందించారు. డీఈఓ మాట్లాడుతూ ఈ నెల 23, 24 తేదీల్లో ఆన్‌లైన్‌లో కాకినాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో 24 ప్రాజెక్టులు పాల్గొన్నాయన్నారు. ఇందులో కర్నూలు అధీనా స్కూల్ విద్యార్థిని రాజా సుహాని ప్రదర్శించిన యంత్రం అందరి ప్రశంసలు అందుకుందన్నారు. త్వరలో దేశ రాజధానిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలని విద్యార్థినికి డీఈఓ సూచించారు. అభినందన కార్యక్రమంలో జిల్లా సైన్స్ టీచర్ రంగమ్మ, గైడ్ టీచర్ డి.రసూల్ రాయల్ పాల్గొన్నారు.

యంత్రం ఎలా పనిచేస్తుందంటే..

వేరుశనగకాయల నుంచి విత్తనాలు వేరు చేసేందుకు రైతులకు అధిక ఖర్చు అవుతోంది. ఖర్చు తగ్గించడంతోపాటు సమయాన్ని ఆదా చేసేందుకు యంత్రాన్ని తయారు చేశారు. ఎలాంటి విద్యుత్ సౌకర్యం లేకపోయినా ఇది పని చేస్తుంది. యంత్రం తయారీకి రూ. 2 వేలు మాత్రమే ఖర్చు వస్తుంది. యంత్రంలో వేరుశనగ కాయలు వేసి హ్యాండిల్‌నుతిప్పితే సరిపోతుంది. తక్కువ ఖర్చుతో విత్తనాలు సలువుగా వేరు చేసేందుకు అవకాశం ఉంటుంది.

ఏప్రిల్ 4 నుంచి ఉపాధి శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ మహిళలకు మగ్గంవర్క్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్, పెయింటింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల శిక్షణ కార్యక్రమం ఏప్రిల్ 4 నుంచి మొదలవుతుందన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు 63044 91236 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

2న వాల్మీకుల కృతజ్ఞత సభ

కర్నూలు(రాజ్‌విహార్): వాల్మీకులను ఎస్టీల జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయడంతో ఏప్రిల్ 2వ తేదీన వాల్మీకుల కృతజ్ఞత సభ నిర్వహించనున్నట్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటలకు వాల్మీకి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

ఇంటర్ పరీక్షల్లో 30 మంది డిబార్

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో సోమవారం ఒకే రోజు 30 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. 123 కేంద్రాల్లో నిర్వహించిన సెకండ్ ఇయర్ పరీక్షలకు 34,463 మంది విద్యార్థులకుగాను 33,156 మంది హాజరయ్యారు. 1,307 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆస్పరి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆరుగురు, ఆలూరు జూనియర్ కాలేజీలో ఇద్దరు, కోవెలకుంట్లఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో నలుగురు, డోన్ ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరుగురు, బేతంచెర్ల ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరుగురు, కృష్ణగిరి ఏపీ మోడల్ స్కూల్‌లో ముగ్గురు, బేతంచర్ల పాణ్యం సిమెంట్స్ జూనియర్ కాలేజీలో ముగ్గురు కాపీయింగ్ పాల్పడుతుండగా స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించి డిబార్ చేసినట్లు ఆర్ఐఓ గురవయ్యశెట్టి తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో 19 మంది..

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో సోమవారం నిర్వహించిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 19 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. 68 కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షలకు ఉదయం 4,976 మందికిగాను 4,582 మంది, మధ్యాహ్నం 12,236 మందికిగాను 11,066 మంది విద్యార్థులు హాజరైనట్లు వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

సుబ్రమణ్యేశ్వరుడి హుండీ ఆదాయం రూ.20.53 లక్షలు



హుండీల్లో కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

పాణ్యం: కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి హుండీ కానుకలు లెక్కించగా రూ.20.53 లక్షల ఆదాయం వచ్చింది. సోమవారం ఈఓ రామకృష్ణ ఆధ్వర్యంలో హుండీ కానుకలు లెక్కించగా రూ. 20,53,832 నగదు, మూడు గ్రాముల బంగారు, 1.760 కేజీల వెండి వచ్చింది. గత డిసెంబర్ నెల నుంచి సోమవారం వరకు భక్తులు సమర్పించిన కానుకలను దేవదాయశాఖ జిల్లా కార్యాలయ అధికారి చక్రభరత్ పర్యవేక్షణలో లెక్కించారు. హుండీ లెక్కింపులో గ్రామ పెద్దలు క్రిష్టారెడ్డి, శివరామిరెడ్డి, మిలటరీ సుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

తలసీమియా బాధిత చిన్నారికి రూ.17 లక్షల సాయం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

వెలుగోడు: పుట్టుకతోనే తలసీమియా వ్యాధిబారిన పడి చిన్నారిని ప్రభుత్వం ఆదుకుంది. సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సాయం అందజేసింది. బోయరేవుల గ్రామానికి అంజినాయక్ కుమారుడు తలసీమియా వ్యాధితో బాధపడుతూ ప్రస్తుతం బెంగళూరులోని నారాయణ హృదయాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ బాలుడి చికిత్సకు రూ.17 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పడంతో తల్లిదండ్రులు స్థానిక నాయకుడు ముంతల విజయభాస్కర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి ఈ విషయాన్ని వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే.. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఒక్క రోజులోనే సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.17 లక్షలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కును సోమవారం బాలుడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను, కర్షక జ్యోతి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

డ్రైవర్స్ ఫెడరేషన్ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడిగా హమీద్



అబ్దుల్ హమీద్‌కు ఉత్తర్వులు అందజేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ఆల్ ఇండియా గవర్నమెంట్ డ్రైవర్స్ ఫెడరేషన్ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన సర్దార్ అబ్దుల్ హమీద్ ఎన్నికయ్యారు. ఈనెల 25, 26 తేదీల్లో ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా గవర్నమెంట్ డ్రైవర్స్ ఫెడరేషన్ ఎన్నికల కార్యక్రమానికి అబ్దుల్ హమీద్ హాజరయ్యారు. సోమవారం వివిధ ప్రాంతాల ఫెడరేషన్ అధ్యక్షులను నియమిస్తూ సెక్రెటరీ సత్పాల్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో పనిచేస్తున్న అబ్దుల్ హమీద్‌ను దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడిగా నియమించారు. రెండోసారి దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడిగా నియమితులైన అబ్దుల్ హమీద్‌ను పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



లక్ష్మీకళ మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త రామగోపాల్

ఓర్వకల్లు: కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. తెలంగాణ రాష్ట్రం ఐజ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన రామగోపాల్ అతని భార్య లక్ష్మీకళ(45)తో కలసి బైక్‌పై తమ సమీప బంధువులు బేతంచెర్లలో సుంకులపరమేశ్వరికి చేస్తున్న పూజ కార్యక్రమానికి బయలుదేరారు. మార్గమధ్యంలో ఓర్వకల్లు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రమాదవశాత్తూ ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొనడంతో బైక్ వెనుక కూర్చున్న లక్ష్మీకళ కిందపడడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు సంతానం ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. హైవే పెట్రోల్ వాహనంలో మృతదేహాన్ని కర్నూలు ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.